సాక్షి
తిరుపతి
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



గరుడ సేవకు పటిష్ట ఏర్పాట్లు

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు ఈఓ వెంకయ్య చౌదరి ఆదేశించారు. - 8లో



టూరిజం ప్రోత్సాహక మేళా

ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మంచి వీడియో లేదా రీల్స్ పంపిన వారికి బహుమతులు అందించనున్నారు. - 8లో



ఎస్వీయూలో సమావేశం రేపు

శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో వీసీ అధ్యక్షతన పాలకమండలి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. - 8లో

ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం



ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే ప్రతి పేద విద్యార్థికీ తల్లికి వందనం ద్వారా ఏడాదికి రూ.15 వేలు అందిస్తాం. కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా అందరికీ ఈ పథకాన్ని అందజేస్తాం.

- చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో పులివర్తి నాని, ఎమ్మెల్యే, చంద్రగిరి

మహిళలకు ప్రతి నెలా రూ.1,500



18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఆర్థిక సాయం అందిస్తాం. కుటుంబంలో ఎంతమంది ఉన్నా అందరికీ ఈ పథకం వర్తింపజేస్తాం. ఆర్థిక సహాయాన్ని నేరుగా సదరు మహిళ అకౌంట్‌లో జమచేసి తీరుతాం.

- గూడూరు ఎన్నికల ప్రచారంలో పాశం సునీల్‌కుమార్

ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం



టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. ఇతర రాష్ట్రాలకంటే మరింత మెరుగ్గా మహిళలు ప్రయాణించే విధంగా అవకాశం కల్పిస్తాం.

- వెంకటగిరి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కే.రామకృష్ణ



నిరుద్యోగభృతి, 20 లక్షల ఉద్యోగాలు



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తాం. దీంతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి నిరోద్యిగికి భృతి కింద నెలకు రూ.3 వేలు అందిస్తాం.

- తిరుపతి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

రైతుకు ఏటా రూ.20 వేలు



చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే ఈ ఖరీఫ్ సీజన్ నుంచి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు అందిస్తాం. షరతులు లేకుండా పెట్టుబడి సాయం అందించి ప్రోత్సహిస్తాం.

-శ్రీకాళహస్తి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

గెలిచిన వెంటనే సూపర్ సిక్స్



టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తాం. షరతులు లేకుండా అందిస్తాం. బాబు హామీ ఇచ్చిన ఆరు పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుకీ చేరేవరకు నిద్రపోం.

- సత్యవేడు ఎన్నికల ప్రచార సభలో కోనేటి ఆదిమూలం


ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తాం. ఎటువంటి నిబంధనలూ పెట్టకుండా ప్రతి ఇంట్లోని మహిళకు ఈ పథకాన్ని వర్తింపజేస్తాం.

- సూళ్లూరుపేట ఎన్నికల ప్రచార సభలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

ప్రతి రైతుకూ ఏటా రూ.20,000




సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.కోట్లలో
2019-20	1,55,207	119.97
2020-21	1,79,030	134.81
2021-22	1,81,711	136.55
2022-23	1,76,435	134.73
2023-24	1,80,763	137.01
2024-25	1,92,570	385.14 ఇవాల్సి ఉంది

మోసం..బాబు నైజం



చంద్రబాబు 2014లో 650 హామీలు ఇచ్చి ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చాడు. ఆ తర్వాత వాటిని పట్టించుకోకుండా అమరావతిని భ్రమరావతి చేసేందుకే ఎక్కువ సమయం కేటాయించాడు. రియల్ ఎస్టేట్ దందాల కోసం అమరావతిని రాజధాని చేశారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సూపర్‌సిక్స్ అంటూ ప్రజలను మళ్లీ మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాడు. ఇప్పుడు వంద రోజులు గడుస్తున్నా పథకాల అమలు మాటే ఎత్తలేదు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తొలి రోజు నుంచే పథకాల అమలుపై దృష్టి సారించారు. -పెంచలయ్య, పీహెచ్‌డీ విద్యార్థి, సూళ్లూరుపేట

ఆడబిడ్డ నిధి ప్రతి మహిళకూ రూ.1,500



కేటగిరీ (వయస్సు)	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.కోట్లలో
18-35	2,37,870	35.68
35-50	2,22,987	33.44
50-60	1,98,981	29.84
మొత్తం	6,59,838	98.97

తల్లికి శఠగోపమే



పాఠశాలలు ప్రారంభమై 100 రోజులు కావొస్తున్నా ఇంతవరకు తల్లికి వందనం పథకం అమలు కాలేదు. చంద్రబాబు మాటలు నీటి మూటలుగా మారాయి.. సూపర్‌సిక్స్ అంటూ ప్రగల్భాలు పలికిన బాబు అధికారంలోకి వచ్చాక హామీల అమలు మాట ఎత్తడం లేదు. ఎంతమంది బిడ్డలుంటే అందరికీ ఇస్తామన్నారు. ఇది జరిగేదేనా?. గతంలో జగనన్న అమ్మఒడి ప్రతి ఏటా రూ.15 వేల చొప్పున నాలుగేళ్లకు రూ.60వేలు అందింది. – వై.విజయ, ఏఎమ్‌పురం, వడమాలపేట

నిరుద్యోగ భృతి



నిరుద్యోగ భృతి కులాలవారీగా	భృతికి అర్హులు	మొత్తం రూ.కోట్లలో
ఓసీ	1,59,023	47.70
బీసీ	3,31,715	99.51
ఎస్సీ	82,367	24.71
ఎస్టీ	50,326	15.09
మొత్తం	6,23,431	187.01

భృతి కోసం ఎదురు చూస్తున్నాం



చంద్రబాబు సూపర్‌సిక్స్‌లో భాగంగా నిరుద్యోగ భృతి కింద ప్రతి యువతకు నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడం దారుణం. యువతకు నిరుద్యోగ భృతి అందించాల్సిందే. 20 లక్షల ఉద్యోగాలు ఎప్పటి నుంచి ఇస్తారు ? జాబ్ క్యాలెండర్ మాట ఏమైంది ? ఇదంతా మాయ మాటలేనా?. నిరుద్యోగులు భృతి కోసం జిల్లాలో 6 లక్షల మందికి పైగా ఎదురు చూస్తున్నారు. - భానుశ్రీ, పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకురాలు, తిరుపతి

ఎన్నికలంటేనే చంద్రబాబునాయుడు ప్రజలకు అలివికాని అబద్ధపు హామీలు ఇచ్చి గాల్లో మేడలు కట్టేస్తారు. ఎన్నికల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అంటూ మాటల గారడీకి తెరలేపుతారు. అబద్ధపు హామీలతో అచ్చేయించిన మేనిఫెస్టోను ఇంటింటికీ పంచి అమాయక జనాన్ని బోల్తా కొట్టిస్తారు. అధికారంలోకి వచ్చాక తన నిజస్వరూపాన్ని బయటకు తీస్తారు. అప్పులు.. గత ప్రభుత్వాల తప్పులంటూ ప్రజల నెత్తిపై శఠగోపం పెట్టేస్తారు. ఇప్పుడూ అదే జరుగుతోంది. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ అంటూ దప్పుకొట్టి గద్దెనెక్కిన చంద్రబాబు అధికారం చేపట్టి సెప్టెంబర్ 20వ తేదీ నాటికి 100 రోజులు పూర్తవుతుంది. కానీ ఇప్పటికీ హామీల అమలుపై కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తున్నారు. సూపర్ సిక్స్ అంటేనే భయమేస్తోందంటూ ఎగ్గొట్టేందుకు ప్లాన్ వేశారు. హామీలు అమలు చేయకపోవడంపై ప్రజలు రగిలిపోతున్నారు. భృతి ఎప్పుడిస్తావు బాబూ.. అంటూ నిరుద్యోగులు నిలదీసేందుకు సిద్ధమయ్యారు. తల్లికి వందనం కోసం మహిళలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. వ్యవసాయానికి సాయం ఎక్కడని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలాగే కొనసాగితే అధికార పార్టీల ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీస్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.



బాబు సూపర్ 6 వంచన ఫిక్స్

- సూపర్ సిక్స్ హామీలకు బాబు పంగనామాలు
- ఇచ్చిన హామీలను పట్టించుకోని కూటమి ప్రజాప్రతినిధులు
- అధికారంలోకి వచ్చి 100 రోజులవుతున్నా మాటలతోనే బాబు సర్కారు కాలయాపన
- 2014లో 650 హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు
- 'ఆరు'నూరైనా అమలు చేయాలంటున్న జిల్లా ప్రజలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఠంఛన్‌గా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

తిరుపతి సిటీ/తిరుపతి అర్బన్: ఒకటి కాదు.. రెండు కాదు.. 2014లో డ్వాక్రా, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, భృతి అంటూ 650 హామీలు గుప్పించి అధికారం చేపట్టిన మరుక్షణమే చంద్రబాబు వాటిని తుంగలో తొక్కేశారు. సేమ్..టూ..సేమ్ ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సూపర్‌సిక్స్ అంటూ ఆరు హామీలిచ్చి, అధికారం చేపట్టిన అరగంటకే అమలు చేస్తామంటూ చెప్పారు. కానీ అధికారం చేపట్టి 100 రోజుల వుతున్నా ఆరు హామీల ఊసే లేదు. జిల్లావ్యాప్తంగా 9.29 లక్షల మంది మహిళలు, 6.23 లక్షల మంది నిరుద్యోగులు, 3.40 లక్షల మంది విద్యార్థులు సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురు చూస్తున్నారు. కానీ బాబుతో పాటు కూటమి నేతలు మోసం చేసే దిశగా అడుగులు వేస్తుండడంపై మహిళలు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, మేధావులు మండిపడుతున్నారు. అసెంబ్లీలో మాత్రం సూపర్ సిక్స్ హామీలను చూస్తుంటే భయమేస్తోందని బుకాయిస్తున్నారు.

తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15,000



	అర్హులు	మొత్తం రూ.కోట్లలో
ప్ర.పా	1,10,575	165.86
ప్రయి.పా	1,30,750	196.12
ప్ర.జూ	37,589	56.38
ప్రయి.జూ	61,463	92.19
మొత్తం	3,40,377	510.56

తల్లికి వందనం గాలికేనా?



కుటుంబంలోని ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఆర్థిక సాయం చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో మాట ఇచ్చారు. సీఎం సీట్లో కూర్చుని ఇప్పటికీ 100 రోజులు అవుతున్నా ఆ మాట ఎత్తడం లేదు. 2014లో ఇలానే ప్రజలతో ఓట్లు దండుకుని ఒక్క హామీని సైతం సక్రమంగా నెరవేర్చలేదు. ఎంతోమంది మాలాంటి బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. – కవిత, వరదయ్యపాళెం, సత్యవేడు

సిలిండర్ల మాట ఏమైంది?



కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కావొస్తున్నా ఉచిత సిలిండర్ల మాటే ఎత్తలేదు. చంద్రబాబు మారిన మనిషి అనుకున్నాం. కానీ అతని నైజం ఇప్పుడు బయటపడింది. ఓట్ల కోసం ఊరూరా తిరిగి ఆయన బ్యాచ్‌తో మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామంటూ ఊదరగొట్టారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యేలు సైతం అసెంబ్లీలో మాట ప్రస్తావన కూడా చేయలేదు. ఓట్లు వేసిన మహిళలు బాబును ప్రతి ఇంటా ఆడిపోసుకుంటున్నారు. - లక్ష్మి, జీవకోన, తిరుపతి

తిరుగుబాటు తప్పదు



ఎన్నికలప్పుడు అధికారమే లక్ష్యంగా బాబు అండ్ కో అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారు. సూపర్ సిక్స్‌లో ఒక్కటంటే ఒక్క పథకం కూడా ఇప్పటి వరకు అమలు చేయలేదు. అసెంబ్లీ సమావేశాల్లో ఆ ప్రస్తావనే రాలేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తారనే క్లారిటీ ఇవ్వకుండా దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు. కూటమి నేతలకు త్వరలోనే ప్రజలు గట్టి సమాధానం చెబుతారు. - ఎం.చెన్నయ్య, తాటితోపు, చంద్రగిరి

ఉచిత ప్రయాణం ఎప్పుడో ?



ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్‌లో భాగంగా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత బస్సు అంటూ ప్రచారం చేసి మహిళలను నమ్మించి మోసం చేశారు. అధికారం చేపట్టి 100 రోజులు అవుతున్నా ఉచిత బస్సు ప్రయాణం ఇంతవరకు లేదు. చంద్రబాబు గతంలో లాగా మాయమాటలు చెప్పి మహిళలను మోసం చేశారు. ఎంతో మంది మహిళలు తీర్థ యాత్రలకు, గుళ్ల గోపురాలకు పోవాలని ఎదురు చూస్తున్నారు.

– సుబ్బలక్ష్మమ్మ, పద్మావతిపురం, చంద్రగిరి నియోజకవర్గం

అన్నదాతకు సుఖీభవ ఏదీ?



టీడీపీ అధికారంలోకి రాగానే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారో అని రైతులు వేచి చూస్తున్నారు.

– రామచంద్రారెడ్డి, బంగారుపాళెం

సంక్షేమం.. స్వర్ణయుగం



వైఎస్.జగన్ సర్కారు పాలన కులం, మతం ,పార్టీ, వర్గం వంటి వ్యత్యాసం లేకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను గడప వద్దకే అందించింది. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చడంతో పాటు , మేనిఫెస్టోలో లేని హామీలను సైతం అమలు చేసి చూపించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రత్యేక క్యాలెండర్‌ను సైతం రూపొందించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాల హామీలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసింది. గత ఐదేళ్లలో జిల్లావ్యాప్తంగా 28,13,013 మందికి రూ.8,635.23 కోట్లను సంక్షేమ పథకాల రూపంలో ఖర్చు చేసింది. నాన్ డీబీటీ రూపంలో 5,78,015 మందికి రూ.2,750.71 కోట్లను ఖర్చు చేసింది. మొత్తం ఐదేళ్లలో జిల్లాలోని 33,91,028 మందికి గానూ రూ.11,385.94 కోట్లను వైఎస్సార్‌సీపీ సర్కారు గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా అందజేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల వివరాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	జమచేసిన మొత్తం(కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	1,80,654	151
వైఎస్సార్ సున్నావడ్డీ	72,410	14
ఉచిత పంట బీమా	33,295	23.04
పంట రుణాలు	3,53,652	1244.04
యంత్రసేవా పథకం	472 గ్రూపులకు	120
సూక్ష్మ నీటిసాగు పథకం	2500	15
పట్టుపరిశ్రమ రైతులకు	950	36.56
మత్స్యకార భరోసా	3669	36.69
పేదలందరికీ ఇళ్లు	72,437	13.04
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	61,661	127
వైఎస్సార్ పింఛను కానుక	2,74,894	989.52
వైఎస్సార్ బీమా	815	8.96
వైఎస్సార్ ఆసరా	3,19,049 సంఘాలకు	1194.33
వైఎస్సార్ చేయూత	1,32,466	677.52
జగనన్నతోడు	43,758	132.44
వైఎస్సార్ సున్నావడ్డీ	41867 సంఘాలకు	267.39
జగనన్న విద్యా కానుక	1,57,418	40.92
బైజూస్ ట్యాబ్‌లు	17,097	129.67
జగనన్న విద్యాదీవెన	67,111	199
జగనన్న వసతి దీవెన	66,658	71.17
నేతన్న నేస్తం	3822	41.41
వైఎస్సార్ వాహనమిత్ర	11598	56.44
జగనన్న పాలవెల్లువ	1489	10
వైఎస్సార్ జలకళ	145	1.71
అమ్మఒడి	2,20,880	331.34

క్లుప్తంగా

అప్రెంటీస్‌కు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో అప్రెంటీస్ చేసుకోవడానికి ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప జోన్-4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3వ తేదీలోపు అంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీజిల్ మెకానిక్ 97, మోటార్ మెకానిక్ 6, ఎలక్ట్రీషియన్ 25, వెల్డర్ 4, పెయింటర్ 2, ఫిట్టర్ 9, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ 1 పోస్టులు ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేసిన వారు తమ సర్టిఫికెట్లను నెల్లూరు కాకుటూరు కార్యాలయంలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 9154291408 నంబరులో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. కృష్ణతేజ అతిథిగృహం వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,072 మంది స్వామివారిని దర్శించుకోగా 30,384 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలైన్‌లో అనుమతించారని తెలుపుతున్నారు.

కీచక తండ్రిపై పోక్సో కేసు

తిరుపతిరూరల్ : ఓ తండ్రి తన సొంత కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించాడని స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నుగారిపల్లి పంచాయతీ మణిపిరెడ్డిపల్లికి చెందిన బుజ్జిబాబు తన కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు అతని భార్య, కుమార్తెతో కలసి ఫిర్యాదు చేసింది. దీనిపై సీఐ మద్దయ్య ఆచారి మాట్లాడుతూ నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

మెడి కిల్ బాబు

500 ర్యాంకు వచ్చినా కష్టమేనా..!



మాలాంటి పేదలను ప్రభుత్వం కనికరించాలి. నేను బీఎస్సీ చేస్తున్నా. గత ప్రభుత్వ హయాంలో 450లోపు మార్కులు వస్తే ఎక్కడైనా ప్రభుత్వ కళాశాలలో మెడికల్ కాలేజీలో సీటు వచ్చేది. ఇప్పుడు 500 దాటుతున్నా సీటు రావడం కష్టం అంటున్నారు. అలాంటప్పుడు జనరల్ కేటగిరీ వారికి, దళితులకు తేడా ఏముంటుంది ? ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ కళాశాల్లో సీట్లు పెంచితే బాగుంటుంది.

– పవన్ కుమార్, బీఎస్సీ విద్యార్థి, చిన్నగొట్టిగల్లు మండలం



మాలాంటి వారికి అవకాశం ఇవ్వాలి..



రాష్ట్రంలోని మెడికల్ సీట్లను ప్రభుత్వం ప్రైవేటుపరం చేసేందుకు చూస్తోందనే విషయం ఇటీవల బాగా వైరల్‌గా మారింది. అర్హులైన పేద విద్యార్థులకు మెడిసిన్ సీట్లు భారం కాకూడదనే గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను నిర్మించ తలపెట్టి, 5 కళాశాలలు అందుబాటులోకి తీసుకొచ్చింది. మరో నాలుగు కళాశాలల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ లభ్యమైనట్లు మెడిసిన్ సీట్లు ఏ రాష్ట్రంలో ఉండవు. ఇలాంటి చక్కటి అవకాశాన్ని మాలాంటి వారికి అందించాలి.

– వందన, బైపీసీ, మోడల్ కళాశాల, ఎర్రావారిపాళెం

టూరిజం ప్రోత్సాహక మేళా

- ఆలయాలు, పర్యాటక ప్రాంతాలపై నిమిషం నిడివిగల వీడియోల పోటీ
- మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, మూడో బహుమతి రూ.25 వేలు
- ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం
- పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ వెంకటేశ్వర్



ప్రపంచ పర్యాటక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, టూరిజం అధికారులు

తిరుపతి అర్బన్: ప్రపంచ పర్యాట దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న టూరిజం అధికారులు వీడియోల పోటీలకు సంబంధించి బంపర్ బహుమతులను ప్రకటించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ప్రపంచ పర్యాటక దినోత్సవ పోస్టర్లను టూరిజం అధికారులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ప్రాంతీయ పర్యాట కశాఖ అధికారి రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రెండు కేటగిరీల్లో మొదటి మూడు బహుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. మొదటి కేటగిరీ పరిధిలోకి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలైన శ్రీవారి ఆలయం (తిరుమల), గోవిందరాజస్వామి ఆలయం(తిరుపతి), పద్మావతి అమ్మవారి ఆలయం (తిరుచానూరు), ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం (అప్పలాయగుంట), పరశు రామేశ్వర స్వామి ఆలయం (గుడిమల్లం), శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం (శ్రీకాళహస్తి), కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం (నారాయణవనం), వేదనారాయణ స్వామి ఆలయం (నాగలాపురం), పల్లికొండేశ్వర స్వామి ఆలయం (సురుటుపల్లి), ఈ ఆలయాలపై ఒక నిమిషం నిడివి గల వీడియో, 15–30 సెకండ్ల రీల్స్ చేయాలన్నారు. అత్యుత్తమ వీడియో లేదా రీల్స్ సమర్పించిన వారికి మొదటి బహుమతిగా రూ.1,00,000, రెండవ బహుమతిగా రూ. 50 వేలు మూడో బహుమతిగా రూ.25 వేలు అందిస్తామన్నారు. అదేవిధంగా కేటగిరీ–2 పరిధిలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాలైన ఎస్వీ జూలాజికల్ పార్క్ (తిరుపతి), కల్యాణి డ్యాం, చంద్రగిరి కోట, తలకోన జలపాతం, తలకోన, మామండూరు ఎకో టూరిజం, కైలాసనాథ కోన జలపాతం, శ్రీసిటీ (సత్యవేడు), తూపిలిపాలెం బీచ్ (వాకాడు), ఇరకం ఐలాండ్, పులికాట్ లేక్, నేలపట్టు పక్షుల అభయారణ్యంపై ఒక నిమిషం నిడివి గల వీడియో, 15–30 సెకండ్ల రీల్ అందించాలన్నారు. మంచి వీడియో లేదా రీల్స్ పంపితే మొదటి బహుమతి రూ.1,00,000, రెండో బహుమతి రూ.50 వేలు, మూడో బహుమతి రూ.25 వేలు ఇస్తామన్నారు. ఈనెల 24వ తేదీలోపు వీడియోలు లేదా రీల్స్‌ను edtpt@aptdc.in లేదా collector.tirupati@apgov.in మెయిల్స్‌కు పంపాలన్నారు. వివరాలకు 6309942027, 9848823086, 9705933311 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జిల్లా నుంచి రూ.84.50 లక్షల సాయం

విజయవాడ వరద బాధితులకు జిల్లా నుంచి అందిన సాయాన్ని సీఎం సహాయనిధికి అందజేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జేసీ శుభం బన్సల్‌తో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, స్కూల్స్, వ్యాపారులు, సేవా సంస్థల నేతృత్వంలో బుధవారం వరకు రూ.84,50,193 వచ్చిందని వెల్లడించారు. బుధవారం నారాయణ విద్యాసంస్థల పిల్లల నుంచి వసూలు చేసిన రూ.27,01,760 నగదును డీజీఎం కొండలరావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి సూర్యనారాయణ రూ.61,800 ఉద్యోగుల నుంచి వసూలు చేసి కలెక్టర్‌కు చెక్కును అందించారు.

ప్రొటోకాల్ పాటించండి

ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరానికి దేశ విదేశాల నుంచి పలువురు ప్రముఖులు విచ్చేస్తున్న నేపథ్యంలో వారి కేడర్‌ను బట్టి ప్రొటోకాల్ వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తిరుమలతో పాటు శ్రీకాళహస్తి, తిరుచానూరు, ఇతర ఆలయాలను దర్శించుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహణ, పర్యాటక కేంద్రాల సందర్శనకు విచ్చేసే కేంద్ర, రాష్ట్రమంత్రులతో పాటు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులకు ప్రొటోకాల్ పాటించాలన్నారు. రేణిగుంట విమానాశ్రయంలో అధికారులకు అవసరమైన మేరకు ఎయిర్‌పోర్ట్ అధికారులు పాస్‌లు ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, రూయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు, టీటీడీ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పోలీస్, రెవెన్యూ అధికారులు విచ్చేశారు.

ఎస్వీయూ పాలకమండలి సమావేశం రేపు

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ పాలక మండలి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవానికి, ఉపాధ్యాయ దినోత్సవానికి పాలక మండలికి ఆహ్వానం పంపని అధికారులు.. ఇప్పుడు తమ పనులను చక్క బెట్టుకునేందుకు ఈసీ సమావేశం ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇదే చివరి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంగా నిలిచిపోనుందని పలువురు విద్యావంతులు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. బాబు సర్కారు పాలకమండళ్లను పూర్తిగా నిర్వీర్యం చేసి 'బోర్డ్ ఆఫ్ గవర్నర్స్' పేరిట వర్సిటీలను పారిశ్రామికవేత్తల చేతుల్లో పెట్టబోతున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం సంకేతాలు ఇచ్చిన విషయం విదితమే. ప్రస్తుత ఈసీ మీటింగ్‌లో వర్సిటీ అధికారులు గత చంద్రబాబు పాలనలో పెండింగ్‌లో ఉన్న స్వకార్యాలను చక్కబెట్టి తమ పాపాలను కడుక్కునే ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో ప్రధాన అజెండాగా అధికార పార్టీ అనుచరులుగా ముద్రపడిన వర్సిటీలోని అధ్యాపకుల కేసు విషయంలో కోర్టు ఆదేశాలపై ప్రధానంగా దృష్టి సారించి ఉనికి కాపాడుకునే యత్నాలు చేయనున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక ఉద్యోగుల తొలగింపు, అంతర్గత బదిలీల వ్యవహారం, ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఉన్నతస్థాయి పదవుల నియామకంపై న్యాయ పరమైన చిక్కులు రాకుండా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మరి ఈ సమావేశంలో అధికారుల అజెండాపై ఎంతవరకు ఆమోద ముద్ర పడుతుందో వేచి చూడాలి.

తల్లిదండ్రుల కలలను నెరవేర్చండి



మాట్లాడుతున్న టీటీడీ డీఈఓ నాగరాజు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2024–2025 విద్యా సంవత్సరంలో చేరిన నూతన సంవత్సరం విద్యార్థినులకు ఓరియంటేషన్ ప్రోగ్రాంను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ డీఈఓ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ అధ్యాపకులు చెప్పే పాఠాలతో పాటు జీవిత పాఠాలను నేర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను నెరవేర్చే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ మాట్లాడుతూ కళాశాలలో చదువుకున్న విద్యార్థినులు దేశ విదేశాల్లో వివిధ రంగాలలో స్థిరపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వరి మూర్తి, డాక్టర్ డీఎం ప్రేమావతి, డాక్టర్ స్వరాజ్య లక్ష్మి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ భద్రమణి, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.



హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న చంద్రగిరి డీఎస్పీ నరసింగప్ప

తిరుపతి రూరల్: టీ తాగేందుకు వచ్చిన డ్రైవర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు చంద్రగిరి డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆగస్టు 31వ తేదీ అర్ధరాత్రి తనపల్లి క్రాస్ వద్ద హైవేపై టీ తాగేందుకు వచ్చిన వెదురుకుప్పం మండలం చిన్నగారిపల్లికి చెందిన బైరాగి రమేష్‌పై ఇద్దరు వ్యక్తులు కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచి పారిపోయారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రెండు ప్రత్యేక బృందాలతో విచారణ చేశామన్నారు. బుధవారం ఉదయం రమేష్‌పై హత్యాయత్నానికి పాల్పడిన తనపల్లికి చెందిన హేమసుధాకర్, వేణును అరెస్ట్ చేసి, దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుల్లో హేమసుధాకర్ గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లు చెప్పారు. ముద్దాయిలను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ మూర్తి, ఏఎస్ఐ రాఘవ, ఆరీఫ్‌లను తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారని, వారికి రివార్డుల కోసం సిఫారసు చేయడం జరిగిందన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఏర్పేడు: మండలంలోని పెనుమల్లం క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి ఐదుగురు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పెనుమల్లం క్రాస్ వద్ద స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి మూడు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు ఈశ్వరయ్య, జగదీశ్, చిరంజీవి, నాగరాజు, మణిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

గరుడ సేవకు పటిష్ట ఏర్పాట్లు

తిరుమల: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 8వ తేదీన జరిగే గరుడసేవ నిర్వహణకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి ఆదేశించారు. బుధవారం ఆయన తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో గరుడసేవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఇందులో భాగంగా గ్యాలరీల్లోకి ప్రవేశం, నిష్క్రమణ, హోల్డింగ్ పాయింట్లు, అన్నప్రసాద వితరణ, యాత్రికుల రద్దీ నిర్వహణ, పోలీసుల భద్రత, శ్రీవారి సేవకుల సేవలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచడం తదితర అంశాలపై అదనపు సుదీర్ఘంగా చర్చించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లల తల్లిదండ్రులతో సహా అన్ని ప్రత్యేక దర్శనాలతో పాటు, అన్ని ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసిందని చెప్పారు. అక్టోబర్ 7వ తేదీ రాత్రి 9 గంటల నుంచి అక్టోబర్ 9 ఉదయం 6 గంటల వరకు రెండు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను నిషేధించినట్లు తెలిపారు. సమావేశంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, తిరుమలలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రికెటర్ల భవిష్యత్‌కే ప్రాధాన్యం




మాట్లాడుతున్న విజయకుమార్

తిరుపతి కల్చరల్ : జిల్లాలో ప్రతిభ గల క్రికెటర్లకే ప్రాధాన్యం ఇస్తున్నామని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అసోసియేషన్‌ను కబ్జా చేసేందుకు యత్నించిన వారిపై 17 ఏళ్ల కోర్టులో పోరాటం చేసి విజయం సాధించామన్నారు. ప్రతి క్రీడాకారుడికి న్యాయం చేస్తామన్నారు. అలాగే అంపైర్లు–100, కోచ్‌లు–50, స్కోరర్లు–50, మేనేజర్లు–50 మొత్తం 250 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. 18 ఏళ్లు నిండి, పది నుంచి డిగ్రీ ఉత్తీర్ణత అయిన వారు ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9849058490, 9573378778 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయస్థాయిలో ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీన నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ టెస్ట్(ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏ ప్రభుత్వ పాఠశాలల్లో అయినా 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఆధార్ కార్డులో ఉన్నట్టు విద్యార్థి పూర్తి పేరు, పుట్టిన తేదీ, తండ్రి/తల్లి పేరు సరిగ్గా నమోదు చేయాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుమును ఆన్‌లైన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా చెల్లించాలని సూచించారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును ఈ నెల 27వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో, అలాగే డీఈఓ కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చని కోరారు.

నేడు చెన్నైకి నీరు విడుదల



కండలేరు జలాశయం

రాపూరు: మండలంలోని ప్రముఖ జలాశయమైన కండలేరు నుంచి గురువారం చెన్నై నగర ప్రజలకు తాగునీరు విడుదల చేయనున్నట్లు జలాశయం డీఈ విజయరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కండలేరు హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువ ద్వారా చెన్నై నగరానికి నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ రామ్‌గోపాల్, ఎస్ఈ రమణారెడ్డి, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

పోలేరమ్మ జాతర రెండో చాటింపు

వెంకటగిరి రూరల్ : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మతల్లి జాతర రెండో చాటింపు వేడుకలు వెంకటగిరి పట్టణంలో భక్తిశ్రద్ధలతో బుధవారం జరిగాయి. తొలుత కాపాళెంలోని గాలిగంపుల పోలేరమ్మతల్లి, అనంతరం కామాక్షమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పోలేరమ్మ తల్లి జాతరకు సంబంధించి ఈనెల 25, 26న పోలేరమ్మతల్లి జాతర ఆహో..అంటూ పనిబాపన వాళ్లు రెండో చాటింపు వేశారు. ఈ వేడుకల్లో యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జై పోలేరి.. జైజై పోలేరి అంటూ సందడి చేశారు. కాంపాళెంలోని ప్రధాన మార్గంలో వరదరాజస్వామి దేవస్థానం, బజారువీధి మీదుగా పోలేరమ్మతల్లి ఆలయం, ఆర్చి, కాశీపేట కూడలి మీదుగా చాటింపు వేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఓజిలి : మండలంలోని పెదపరియ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే కీమెన్ వెంటనే స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించారు. గూడూరు రైల్వేపోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని, బ్లూకలర్ జీన్స్ ప్యాంటు, డార్క్ కలర్ జీన్స్ షర్టు ధరించి ఉన్నాడు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పెళ్లకూరు: మండలంలోని రాజుపాళెం అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి వేపచెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు సమాచారం మేరకు విజయనగరం జిల్లా నర్సీపురం ప్రాంతానికి చెందిన గంగునాయుడు కుమారుడు చంద్రశేఖర్ గత కొంతకాలంగా మెగా కంపెనీలో పని చేస్తున్నాడు. అయితే భార్యాభర్తల మధ్య వివాదాలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో రోజూ ఫోన్‌లో మాట్లాడుతూ భార్యాభర్తలు గొడవ పడేవారని తోటి కార్మికులు చెప్పారన్నారు. మద్యం కూడా ఎక్కువగా సేవిస్తూ విధులకు సక్రమంగా వెళ్లడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే చంద్రశేఖర్ రాజుపాళెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వేపచెట్టుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మునస్వామి తెలిపారు.